# 16

# శుభవార్తను పంచుకున్న వ్యక్తులు

## (2 రాజులు 7:3-16)

యింతకు ముందు పాఠంలో ఆరామీయులు సమరయను ముట్టడించడం గురించిన సంగతులు వివరించుకోవడం జరిగింది. ఆహారం లభ్యం కాకపోవడంవల్ల పట్టణంలోవున్న వారు తల్లడిల్లిపోయారు. ఎలాగో ఒకలాగ వాళ్ళ కడుపులనింపుకునే యత్నంలో విఫలులై అటు దేవునిపట్ల యిటు సృష్టి పట్ల పాపం చేశారు.

అలా అలమటించిన వారిలో నలుగురు కుష్ఠ రోగులు కూడ ఉన్నారు. ఈ పాఠం ఆ నలుగురి వ్యక్తులమీదే కేంద్రీకృతమైయుంటుంది. వారిని నేను "శుభవార్త పంచుకున్న వ్యక్తులు" అని పిలుచుచున్నాను. మనము వారి కథను సమీకరించుచున్నప్పుడు, మంచి వార్తను పంచడంలో నీకు మరియు నాకు ఉన్న బాధ్యతను గట్టిగా నొక్కి చెప్పవలసియున్నది.

### యిక శుభవార్తను గురించి (7:3–16)

**శుభవార్త అనేది వారికి**

"అప్పుడు పట్టణపు గుమ్మమునొద్ద నలుగురు కుష్ఠరోగులుండగా"[1] (3ఎ వచనం). మనం నయమానును గురించి నేర్చుకున్న పాఠంలో, మనం ఈ కుష్ఠు వ్యాధి యొక్క భయంకరత్వాన్ని గురించి చర్చించుకున్నాం. ఇశ్రాయేలులో, ఈ కుష్ఠు రోగుల్ని పట్టణాల్లోకి నగరాల్లోకి రానిచ్చేవారు కాదు (లేవీయకాండము 13:46; సంఖ్యాకాండము 5:2, 3). ఈ నలుగురు మనుష్యులు బహుశ ఆ ద్వారం దగ్గర ఒక వేళ వచ్చిపోయేవాళ్ళు ఏదో ఆ పనికిమాలిన రొట్టి ముక్కలు పడేస్తారేమోనని పడిగాపులు కాస్తూవుండియుంటారు. ఏదైతేనేం అసలుంటేగా వేయడానికి, ఆ పట్టణంలో వారు ఆహారం లేక ఎలా అలమటిస్తున్నారో ఈ కుష్ఠువాళ్ళు కూడ అలాగే ఉన్నారు.

యిక ఆ నల్గురు సమాలోచనలో పడినారు: "–మనము చచ్చిపోవువరకు ఇచ్చట ఎందుకు కూర్చుండవలెను?" (2 రాజులు 7:3బి), *వారేదో* చేయాలని తలంచారు యిక ఆలస్యమెందుకు *వెంటనే* చేయండి "పట్టణములోనికి పోవుదమనుకొంటిమా పట్టణమందు క్షామమున్నందున అచ్చట చచ్చిపోవుదుము" (4ఎ వచనం). వారు ఎలాగో ఒకలా ఆ పట్టణ గవునలు దాటి లోపలికి వచ్చినప్పటికి, అక్కడ పరిస్థితులేమి మెరుగు పడలేదు. మరి వారున్న చోటనే నిలిచివున్నారంటే, చివరకు చావుకు గురైనట్టే (4బి వచనం).

చివరిగా, ఈ కుష్ఠు వాళ్ళు ఒక నిశ్చయానికి వచ్చారు, "పదండి సిరియనుల దండు పేటలోనికి, పోవుదము రండి వారు మనలను బ్రదుకనిచ్చిన బ్రదుకుదము, మనలను చంపిన చత్తుము అని చెప్పుకొనిరి" (4సి వచనం). యింకోవిధంగా చెప్పాలంటే, "వాళ్ళు మనలను మహా చంపితే చంపగలరు, చంపనీయండి. మనం ఎలాగైనా చావడానికి సిద్ధంగావున్నాం. రోజుకు రోజుకు క్షీణిస్తు చచ్చేకంటే ఒక్కసారి ఆ కత్తివాతన బడ్డామంటే ఒక్క క్షణంలో

హాయిగా చస్తాం. అదిగాక యింకోవిధంగా జరుగుతుందేమో ఎవరికి తెలుసు? వాళ్ళు మనలను ఖైదీలుగా పట్టి కెళ్ళి పోషించవచ్చు."

ఈ విధంగా వారు, "సందెచీకటియందు సిరియనుల దండు పేటలోనికి పోవలెనని లేచిరి" (5ఎ వచనం). వారు సందె చీకట్లో ఎందుకు వెళ్లవలసి వచ్చిందో అన్న విషయాన్ని రచయితలు కొంత ఆలోచించవలసి వచ్చింది. దానికి వివరణ ఎంతో సులువు: అదేమంటే వారెప్పుడు నిర్ణయం తీసుకున్నారో వెంటనే స్పందించారు.

ఆ కుష్ఠరోగులు ప్రాకారములోపలికి అడుగుపెట్టినప్పటినుండి వారిలో ఎక్కడలేని భయాందోళనంతో చలించిపోయారు. ఏ క్షణంలోనైనా "ఎవర్రా ఎవరక్కడ ఎక్కడికెళ్తున్నారు ఆగండి" అనే శబ్దాలు వినబడవచ్చు. ఏక్షణంలోనైనా నేలమీద బోర్లపడి కరుణకై వేడుకోవాల్సి వస్తుందని ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

వారు ఆ మిలిటరీ పాళెం సమీపిస్తున్న కొద్ది శబ్దాలు వినబడ్డం మొదలవుతుందని అంతా కోలాహలంగావుంటుందనుకున్నారు (7ఎ వచనం చూడు); కాని వారక్కడికి చేరుకోగానే నిశబ్ద వాతావరణం అలుముకొనియుండడం గమనించారు. ఆశ్చర్యచకితులైనారు (10ఎ వచనం). "సిరియనుల దండు వెలుపలి భాగమునొద్దకు రాగా అచ్చట ఎవరును కనబడక పోయిరి" (5బి వచనం). యిక వాళ్ళు యిటు అటు చూస్తూ ఆ చీకట్లో తచ్చాడడం జరుగుతుందని నేను ఊహించుచున్నాను. ఆ కుష్ఠువాళ్ళకు మరో ఆలోచన తట్టింది, రాజేమన్నా వలపన్నే ప్రయోగం చేశాడా అన్న అనుమానం (12 వచనం), వాస్తవానికి అక్కడ ఒక్క పురుగు కూడా లేరు. ఆపాళెం అంతా ఒక ఎడారిలా ఉంది.

"యెహోవా రథముల ధ్వనియు గుఱ్ఱముల ధ్వనియు గొప్ప సమూహపు ధ్వనియు సిరియనుల దండునకు వినబడునట్లు చేయగా" (6ఎ వచనం). కొందరు వ్యాఖ్యాన కర్తలు ఈ సందర్భాన్ని ప్రజలకు వివరించాలని అంటే ప్రభువు ఈ విషయాన్ని ఎలా తానే నిర్వహించాడో అన్న వివరణను తెలియజేయాలని కోరుచున్నారు. కొందరేమో దీన్ని "లోకంలో సహజంగా జరిగే విషయంలా" వివరించడానికి ప్రయత్నించారు. ఈ ఆరామీయులు ఆ శబ్దాన్ని వినేటట్టు చేయడానికి కారకుడు దేవుడేనన్న విషయం ప్రతి విశ్వాసి తప్పకుండ నమ్మడానికి తగినంత ఋజువు వున్నది. ఎందుచేతనంటే, ఆ అనుభవం ఎంతో వాస్తవమైనదిగా ఉన్నది. కాబట్టి. "దేవుడు మోయాబీయులను గొప్ప వెలుగు అని మరియు ఆయన ఆరామీయులను 'శబ్దం' అనే సూచక క్రియల ద్వారా జయించాడు ([2 రాజులు] 3:20–23)."[3]

అ శబ్దాన్ని సైనికులు విన్నప్పుడు వారిలా అన్నారు, "మన మీదికి హిత్తీయుల రాజులకును ఐగుప్తీయుల[4] రాజులకును బత్తెమిచ్చియున్నాడని సిరియనులు ఒకరితోనొకరు చెప్పుకొనిరి" (6బి వచనం). "హిత్తీయులు" ఉత్తర ఆరాము దేశంలోకి కొన్ని రాష్ట్రీయ పట్టణాలకు చెందినవారు, హిత్తీయుల రాజ్యం పడిపోయింది.[5] ఇశ్రాయేలు రాజు ఈ హిత్తీయులను కిరాయి తీసుకొని తమను ఉత్తర వైపునుండి దండెత్తుతున్నాడనియు ఐగుప్తీయులు దక్షిణమునుండి తమను దండెత్తుతున్నారని ఆరామీయులు నిర్ణయానికి వచ్చారు.

ఆ దెబ్బతో సైన్యం భయకంపితులై "తమ గుడారములోనైనను గాడిదలలోనైనను దండుపేటలో నున్నవాటిలోనైనను ఏమియు తీసుకొనకయే తమ ప్రాణములను రక్షించుకొనుట చాలుననుకొని సందె చీకటిని ఉన్నది ఉన్నట్టుగ పేట విడిచి పారిపోయియుండిరి" (7 వచనం). వాస్తవానికి వారు గుఱ్ఱాలమీద ఎంతో త్వరిత గతిని వెళ్ళగలరు కాని ఆ గుఱ్ఱాలను

కూడ వదలిపారిపోయారూ అంటే వారెంత భయకంపితులైనారో అర్థమవుతుంది.

ఎంతో జాగ్రత్తగా ఆ కుష్ఠువాళ్ళు ఆ పాళెంలో ప్రవేశించారు (8ఎ వచనం). ఆ శిబిరాల్లో నిప్పు రాజుకుంటుంది వేడి గాల్పులు వేస్తున్నాయి, జంతువులు పలుపులతో కట్టబడియున్నాయి కాని ప్రజలు లేనేలేరు (10 వచనం చూడు). వారు చిన్నగా ఒక్కొక్క అడుగు వేసుకుంటూ ముందుకు వెళ్ళి ఆ గుడారాల్లోకి తొంగి చూచారు అమ్మో! అదేందోగాని మంచి ఆహారం వండివార్పు చేయబడిందిగాని దాన్నెవరు తిన్నట్టులేరు. వారు "భోజనపానములు చేసి" (8బి వచనం); బహుశ ఆహారం అనుకున్నంత రుచిగా లేదనుకుంటా, బాగా మర్మంగా చూచి వెండి బంగారాలు, విలువైన వస్త్రాలను ధనాగారాన్ని భాగా దోచుకొని దోక్కోడానికి చీకట్లోకి వెళ్ళిపోయారు. ఆ విధంగా ఒక గుడారంలోనుండి మరో గుడారానికి పరుగెత్తుకుంటూ కావల్సినంత దోచుకోవలసినంత దోచుకున్నారు (8సి వచనం). యిక వాళ్ళు ఏ మాత్రం బీదలు కాదు యిప్పుడు సంపన్నులే!

**యితరులకు శుభవార్త**

కొంత ఆలస్యంగానైనా వాళ్ళని మనస్సాక్షి గద్దించింది. వారు మరో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. "మనము చేయునది మంచి పనికాదు, నేటి దినము శుభవార్తమానముగల దినము, మనము ఊరుకొననేల" (9ఎ వచనం). వాస్తవానికైతే వారికి తిని తలకు పోసుకునేంత వుంది, కాని మరోప్రక్క పట్టణంలో ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు.

ఒక అనుసరణీయమైన సందర్భం యిక్కడ యిమిడియున్నది, "తెల్లవారువరకు మనము యిచ్చట నుండినయెడల ఏదైన నొక అపాయము మనకు సంభవించును" (9బి వచనం). ఇది ఒక వాస్తవమైన ముగింపు. ఉదయమవుతుంది శత్రువులు వెళ్లిపోవడం కావలివారు కనుగొంటారు. చివరకు ప్రజలేమనుకుంటారంటే ఈ కుష్ఠువాళ్ళు ఈ వార్తను తమదాక రాకుండ చేశారు అని. యికవారికి శిక్ష తప్పదు – ఇట్లు ప్రజలనుండి, రాజునుండి చివరకు దేవునినుండి కూడ.

చాలాకాలం క్రితం, పురాతన బోధ ఇలా ఉంది: ఎవరైనా ఒక వ్యక్తి ఒక మంచిని కనుగొని అది తన పొరుగువారికి ఎంతో మేలు చేస్తుందని తెలిసియుండి కూడ, అది తనమట్టుకే ఉంచుకున్నాడంటే అది దొంగతనంతో సమానం. వాడు దొంగ అనబడతాడు. ఉదాహరణకు చెప్పాలంటే, తన పొరుగువాని కుటుంబానికి ఆహారం ఎంతో అవసరమని అతడు ఎరిగి యున్నాడని, మరియు తన పొరుగువానికి ఒక బస్తా గోదుమ పిండి ఉచితంగా ఎక్కడ లభిస్తుందో కూడ తెలుసు కాని ఆ సంగతి అతనికి చెప్పలేదు. అందువల్ల యితడెంతో దొంగగా గుర్తించబడతాడు, అతడే తన పొరుగువాని యింట్లో జొరబడి ఒక బస్తా (గోదుమపిండి) దొంగిలించి ఎంత పనిజేశాడన్నమాట. అందువల్ల ఈ కుష్ఠువాళ్ళు గనుక సమరయ ప్రజలకు యిక్కడ ఆహారం దొరుకుతుందన్న సంగతి చెప్పినట్లయితే వారు దొంగలుగా పరిగణించబడుతున్నారు.

అప్పుడు వారు నిశ్చయించుకున్నారు, "మనము వెళ్లి రాజు ఇంటివారితో సంగతి తెలియజెప్పుదము" (9సి వచనం). వారు ద్వారము వద్దకు వెళ్లి ఆ ద్వారపాలకులతో "వారు ఆరామీయుల పాళెంలో ఏమి కనుగొన్నారో అన్న దాన్ని ఎలుగెత్తి చెప్పారు" (10 వచనం). ఆ ద్వార పాలకులు ఆ సందేశాన్ని రాజనగరుకు చేరవేశారు (11 వచనం).

అక్కడ పరిచారకులు రాజును నిద్రలేపి ఆ నివేదికను అందించారు (12ఎ వచనం చూడు). ఆ సమయంలో గనుక రాజు "ఓహో ఎలీషా అన్నట్లే [7:1] *అంతా* జరిగిందే" అనివుంటే ఎంత బాగుండేదోగదా దానికి బదులు అతడు, "ఆ వార్త ఎంత బాగుందో, అంత నమ్మశక్యంకానిది" అని అనుకున్నాడు. తనవారితో యిలా చెప్పినాడు, "ఆహా! ఆరామీయులు మనకేం చేశారో యిప్పుడు గాని మీకు చెప్పగలను, మనం బాగా ఆకలిగొనియున్నామని వారు గ్రహించారు; అందువల్ల వారు ఈ పాళెమునుండి బైటకు వెళ్లి ఎక్కడో పొలాల్లో దాక్కొని యిలా అనుకుంటున్నారు, 'వారు పట్టణములోనుండి బైటకు వచ్చినయెడల మనము వారిని సజీవులనుగా పట్టుకొని పట్టణమందు ప్రవేశించగలమని యోచనచేసిరి' " (2 రాజులు 7:12బి). హాయి పట్టణాన్ని జయించడానికి యెహోషువ కూడ యిదే వ్యూహం పన్నాడు (యెహోషువ 8).

ఆ రాజుయొక్క సేవకుల్లో ఒకడు, ఈ కథ నిజమా కాదా అని పరీక్షించవలసిందిగా రాజును కోరినాడు. ఆ సేవకుడు యిలా అన్నాడు, "నీకు అనుకూలమైనయెడల పట్టణమందు మిగిలియున్న రౌతులలో అయిదుగురిని తీసికొని పోనిమ్ము" (2 రాజులు 7:13బి). వాస్తవానికి పట్టణంలోవున్న గుఱ్ఱాలన్ని చచ్చాయి (లేదా వాట్ని ఎవరైనా తినేసివుంటారు). ఆ సేవకుడు యింకా యిలా అన్నాడు, "యింతకు ముందు ఇశ్రాయేలువారలలో బహుమంది మనుష్యులు లయమై పోయిరి గదా ... పంపి చూచెదమని చెప్పెను" (13 వచనం). అంటే, అతడేమని చెప్పాలనుకున్నాడంటే "ఎవరినైనా పంపినట్లయితే వారికి సంభవించేది మరణమే, ఒకవేళ పట్టణంలోనే వారు నిలిచియున్నా అక్కడైనా చావక తప్పదు, అలాంటప్పుడు వారినెందుకు పంపకూడదు? అలాంటప్పుడు జరిగే నష్టం ఏముందని?"

చివరకు "రెండు రథాలను వాటి ఆశ్వాలతో సహా" పంపడం జరిగింది (14 వచనం). ఈ రథసారదులు వెళ్లి పాళెం అంతా ఖాళీగా ఉండడం చూచారు, అచ్చం ఆ కుష్ఠ వాళ్లు చెప్పినట్లేవున్నది. ఆరామీయులు పారిపోయిన మార్గాన్ని వారు అనుసరించుకుంటూ వారి రథాలను నడిపించారు అది యొర్దాను నదివైపుగా వెళ్లింది,[5] "సిరియనులు తొందరగా పోవుచు, పోయినంత లెక్క పారవేసిన వస్త్రములను సామానులను పారవేసిరి" (15ఎ వచనం).

ఆ వర్తమానికులు తిరిగి వచ్చి రాజుకు చెప్పారు (15బి వచనం). ఆ మాట పట్టణమంతా పాకింది, అంతంతలోనే ద్వారాలు తెరువబడినవి, "జనులు బయలుదేరి సిరియను దండుపేటను దోచుకొనిరి" (16ఎ వచనం). వారు బాగా తిని సంతృప్తి పడినారు. వారు విడుదల చేయబడ్డారు. వారి విమోచనకు దేవుడే బాధ్యుడు. అయితే ఆయన నలుగురు విలువలేని సామాన్యమైన వ్యక్తులను తన ఉద్దేశం నెరవేర్చుకునేందుకు వాడుకున్నాడు: నలుగురు కుష్ఠ రోగులు ఈ శుభవార్తను యితరులకు అందించడానికి ఎంతో యిష్టపడ్డారు!

## ప్రస్తుతపు శుభవార్త

ఈ కథ నుండి అనేక విషయాలను మన జీవితాలకు అన్వయించుకోవచ్చు, కాని ఈ కుష్ఠువాళ్లమీదే మన ధ్యానను మళ్లించాలని కోరుచున్నాను. ముఖ్యంగా 9 వచనంలోని వారి మాటలను: "మనము చేయునది మంచి పనికాదు, నేటి దినము శుభవార్తమానముగల దినము, మనము ఊరుకొననేల? తెల్లవారవరకు మనము యిచ్చట నుండినయెడల

ఏదైన నౌక అపాయము మనకు సంభవించును గనుక మనము వెళ్లి రాజు ఇంటివారితో సంగతి తెలియజెప్పుదము ...” ఈ కుష్ఠు రోగుల పరిస్థితులను మన పరిస్థితులతో సరిపోల్చుకోవచ్చు.

## మనకు మంచి వార్త

ఈ కుష్ఠువాళ్ల మాటల్లో కొట్టొచ్చినట్లు కనిపించేదేమంటే, “శుభవార్త” మరలా ఒక్కసారి మనం “సువార్త” అనే మాట గురించి జ్ఞాపకం చేయబడుచున్నాము. సువార్త అనగా “సుభవార్త.” ఈ సువార్త కథకు ఆధారం, క్రీస్తు యొక్క మరణం, సమాధి, పునరుత్థానం (1 కొరింథీయులకు 15:1-4). మనం ఈనాటికి “ఈ రోజు శుభవార్త దినం”: అంటూ చెప్పవచ్చు. మనం తప్పిపోయాం, కాని యేసు మన పాపాలను తన పై వేసుకొని మన పక్షంగా మరణించినాడు (1 కొరింథీయులకు 15:3; 2 కొరింథీయులకు 5:21; యెషయా 53:6)! యిక్కడ కుష్ఠువాళ్లు భౌతిక అవసరాలు గురించి శుభవార్తను పంచుకున్నారు: మనమైతే ఆత్మీయ లాభాల గురించి శుభవార్తను పంచుకోవాలి సుమా!

అనేక పోలికలు మనం వెలికితీయవచ్చు. ఈ లోకం “పాపం ద్వారా పట్టబడింది” అనవచ్చు (ఎఫెసీయులకు 6:12). క్రీస్తులేకుండ అనేకులు ఆత్మీయ ఆకలితో అలమటిస్తున్నారు, వారికి ఎలాంటి నిరీక్షణ లేదు (ఎఫెసీయులకు 2:12). ఎలాగైతేనేం దేవుడు తన మహా కృపవలన మానవులను విడుదల చేయడానికి ఒక మార్గాన్ని ఏర్పాటుచేశాడు (తీతు 3:4, 5ఎ; అపొస్తలుల కార్యములు 2:38). యేసు ద్వారా ప్రతి వ్యక్తి పాపంమీద విజయం పొందవచ్చు (1 కొరింథీయులకు 15:56, 57). ఎవరైనా సరే పాలుపొంపుల పొందాలనే యిష్టతతో అంగీకారంతో ఉంటే వారికి ఆత్మీయ ఆశీర్వాదాల “మీద” సమృద్ధిగా సిద్ధంగా ఉంది (మత్తయి 22:9).

యిక్కడ ఈ నలుగురు కుష్ఠ రోగులవలె ప్రభువు సంఘ సభ్యులమైన మనం దేవుడు అనుగ్రహిస్తున్న ఆత్మీయ ఆనందాలను పొందుచున్నాము. మనం గతంలో “ఆహారం లేక అలమటించాము” యిప్పుడు “సంతృప్తిపరచబడినాము” (మత్తయి 5:6 చూడు). ఆత్మీయంగా గతంలో “బీదరికంనుండి” యిప్పుడు “భాగ్యవంతులంగా” తయారయ్యాము (2 కొరింథీయులకు 6:10; మత్తయి 5:3). మనకు ఎన్ని అద్భుతమైన వాగ్దానాలను, ఆశీర్వాదాలను అనుగ్రహించబడినవిగదా! (చూడు ఎఫెసీయులకు 3:20; ఫిలిప్పీయులకు 4:19; హెబ్రీయులకు 7:25.) మనం పౌలుతోకూడ యిలా చెప్పవచ్చు, “చెప్ప శక్యముకాని ఆయన వరమునుగూర్చి దేవునికి స్తోత్రము” (2 కొరింథీయులకు 9:15) - ఆయన కుమారుడు అనే బహుమానం!

## యితరులకు శుభవార్త?

ఇప్పుడు మనకిదొక ప్రశ్న: మనం కలిగియున్నదాన్ని బట్టి చూస్తే ప్రపంచం యొక్క అత్యవసరమైనదేదో గ్రహించగల్గుచున్నామా? అక్కడ ఈ కుష్ఠురోగులు పంచుకున్న రీతిగా శుభవార్తను మనం గనుక పంచుకోక పోయినట్టయితే, “మనం మంచిని చేయడం” లేదని విఫలులమై పోయామని చెప్పుకోవాలి.

ఒక విచారకరమైన వాస్తవమేమంటే, యేసును గూర్చిన శుభవార్తను ప్రతిసారి యితరులతో

పంచుకోలేదనియే. మరి యిదెందుకు సంభవిస్తుందో నేను చెప్పలేక పోతున్నాను. దీనికి కారణం బహుశ "ప్రభువు యొక్క దయను కనికరాన్ని రుచిచూడ లేదేమో" అన్న సందేహం కలుగకపోదు (1 పేతురు 2:3); లేదా వారసలు రక్షించబడిలేదేమో. అంద్రేయ ప్రభువును తెలుసుకున్న వెంటనే యితరులకు చెప్పడానికి పరుగెత్తాడు (యోహాను 1:40-42). యిది సహజమైన స్పందన. ఒకడు శుభవార్తను పంచుకోవాలనే భావనను కలిగియుండకపోతే, ప్రభువుతో తనకున్న సంబంధాన్ని పరీక్షించుకోవాలి.

యింకొక కారణం కూడ అయుండవచ్చు ప్రభువు మనకు చేసిందేదో దాన్ని ఆనందంతో అంగీకరించకపోయివుండవచ్చు (చూడు 2 పేతురు 1:9బి). మనం గనుక అభిమానంతో ఆనందించి గ్రహించినట్టయితే తప్పక శుభవార్తను అందించడానికి యిష్టపడతాం (లూకా 8:39).

కొన్నిసార్లు శుభవార్తను చెప్పడానికి మనం విఫలులమైనప్పుడు యితరులపట్ల మనకు అంతగా పట్టింపులేదని అర్థమవుతుంది. ఒకవేళ మన యిరుగుపొరుగువారు ఆహారం లేక అలమటిస్తున్నారని మనకు తెలిసినట్టయితే వారికి ఆహారం పెట్టలేని కఠిన హృదయంతో ఉండలేం. మన చుట్టూవున్నవాళ్ళు బహుశ శరీర సంబంధమైన ఆహారం లేక "అలమటించడం లేదు" కాని ఆత్మీయ సంబంధమైన ఆహారం లేక అలమటిస్తున్నారు. మనం గనుక వెంటనే వాక్యమనే "పాలు" మరియు "ఆహారం" యివ్వనట్టయితే (1 పేతురు 2:2; హెబ్రీయులకు 5:12; KJV). వారు మన గురించి ఏమనుకొంటారు? నిజమే "మనం ఏ మంచిని చేయలేకపోతున్నాం."

బహుశ మన సమస్య క్రైస్తవ ఆత్మీయతను పోగొట్టుకొని జీవిస్తున్నామేమో. మొదటి క్రైస్తవులు ఎవరిని కలిసినప్పటికి వారితో శుభవార్త పంచుకోడానికెంతో ఆసక్తి కనబర్చినారు (చూడు అపొస్తలుల కార్యములు 5:42; 8:1, 4). అలాచేయడంవల్ల ప్రభువు యొక్క ప్రధానమైన ఆజ్ఞకు శిరసావహించారు (మత్తయి 28:18-20; 10:27 చూడు).

మనం యేసును గూర్చి యితరులకు చెప్పడానికి అనేక కారణాలుంటాయి, నశించినవారి పట్ల భారం, ప్రభువుకు విధేయత చూపాలన్న మన ఆసక్తి. మనం కూడ ఆ కుష్ఠువాళ్ళకున్న బాధ్యతను గురించి ఆలోచిస్తే: "మనం ఆలస్యం చేస్తే ... మనకు శిక్షపడుతుంది" అన్నట్లు వారు ఆలోచించినట్లు మనం చలించిపోవాలి సుమా! యెహెజ్కేలు 3:18లో ప్రభువునొద్దనుండే మనకు వినవస్తుంది: "అవశ్యముగా నీవు మరణమవుదువని నేను దుర్మార్గునిగూర్చి ఆజ్ఞ ఇయ్యగా నీవు అతనికి హెచ్చరిక చేయకయు, అతడు జీవించునట్లు తన దుర్మార్గతను విడిచి పెట్టవలెనని వానిని హెచ్చరిక చేయకయు నుండినయెడల ఆ దుర్మార్గుడు తాను చేసిన దోషమునుబట్టి మరణమవును గాని అతని రక్తమునకు నిన్ను ఉత్తరవాదిగా ఎంచుదును."

ఔను "ఈ దినం శుభసందేశం దినం" కదా! గతాన్ని చూచినట్టయితే, మనం ఎంతో మౌనంగా ఉన్నామని అంగీకరించవలసియున్నది; కాని భవిష్యత్‌ను దృష్టిలో వుంచుకొని చూస్తే ఆ కుష్ఠువాళ్లు అన్నట్లు: "రండి యిప్పుడు మనం వెళ్లి చెబుదాం" అని మనం తప్పక చెప్పాలి.

**ముగింపు**

ఈ పాఠం ప్రత్యేకంగా క్రైస్తవులకు కేటాయించబడింది. "శుభవార్తను" మనం అందించ

డానికి ఒకర్నొకరం ప్రోత్సాహపర్చుకొంటూ సంసిద్ధులమై ఉండవలసివుంది. ప్రభువిచ్చిన ఈ చక్కని సదావకాశాన్ని యింతవరకు ఉపయోగించుకోని వారికి, నేను ఈ పాఠం ముగిస్తుండగా, వారు వెంటనే స్పందించాలని నేను విన్నవించుకొనుచున్నాను. ఆ కుష్ఠ వాళ్లు పట్టణం వెలుపల ఆకలితో అలమటిస్తున్నప్పుడు "మనం చచ్చేవరకు యిక్కడెందుకు కూర్చోనివుండాలి?" (2 రాజులు 7:3) అనుకున్నారు. అలాంటి వారి ప్రశ్నలాంటిదే నేను అడగాలనుకొంటున్నాను: "నీవు కదలకుండ, కదలించబడకుండా అక్కడెందుకు కూర్చొనివుంటావు. కొనవూపిరితో మరణానికి దగ్గరయ్యేవరకు ఎందుకు కూర్చుంటావు? నీవు మరణించే పర్యంతం నీవు దయచేసి యిక కూర్చోవద్దని" నా హృదయ పూర్వకముగా నీకు మనవి చేయుచున్నాను. యేసునందు నమ్మికయుంచినట్టయితే (యోహాను 3:16) నీవు నీ పాపముల విషయమై పశ్చాత్తాపపడినట్లయితే (లూకా 13:3), అననియాను సౌలు అర్థించినట్లుగా నిన్ను నేను అర్థిస్తున్నాను, "గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసుకొనుము" (అపొస్తలుల కార్యములు 22:16)!

---

సూచనలు

[1]యూదుల ఆచారపరమైన దైవ ప్రేరేపితము కాని (అంతగా పట్టించుకోని) వివరణను బట్టిచూస్తే వీరు గేహజీ అతని కుమారులు అయుండవచ్చు (Adam Clarke, *The Holy Bible with a Commentary and Critical Notes*, vol. 2, *Joshua - Esther* [New York: Abingdon-Cokesbury Press, n.d.], 504; Matthew Henry, *Commentary on the Whole Bible*, ed. Leslie F. Church [Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1961], 409). [2]యిక్కడ "శివారులు" అంటే సమరయ పట్టణానికి బైట ఆరామీయుల సైనిక శిభిరాలు అని చెపపవచ్చు. [3]Warren W. Wiersbe, *Be Distinct* (Colorado Springs, Colo.: Victor, 2002), 55. [4]యిది ముటారి లేక ముజార్ లేక వేరే ప్రాంతము అయుండవచ్చు. నేను పరిశీలించిన తర్జుమాలలో "ఐగుప్తీయులు" అని ఉంది. [5]J. Robert Vannoy, notes on 2 Kings, *The NIV Study Bible*, ed. Kenneth Barker (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985), 535. [6]యిక్కడ సైన్యానికి ఆరాముకు రెండు అనుకూలమైన మార్గాలున్నాయి. వారు ఉత్తర దిక్కుగా వెళ్లీ, తూర్పువైపుగా మరలవచ్చు. లేదా వారు తూర్పుదిశగా యొర్దానువైపుగా వెళ్లి ఉత్తరంగా తిరగవచ్చు. వారు రెండవ మార్గం ఎంచుకున్నారు.